# మా జరీనాంటీ స్పెషలు సెలవల కత!

మా యిద్యానికేతన్‌లో వెలకొక తడవ, శుక్కురోరం రోజు కిలాసులోకి సర్క్యులర్ బుక్కు వస్తుంది. మా రమాదేవి టీచరో, శశిప్రబ టీచరో ఆ సర్క్యులర్ బుక్కుని చేతిలోనికి తీసుకోవంగావే దాంట్లోఉండేదేందో మాకు ముందరే తెలుసు గాబట్టి యిద్దరమో ముగ్గురమో పిలకాయలం ఒకే సారి పైకి లేచేసి ఎగరతా ఎగరతా మా టీచరు కంటే ముందరే ఆ సర్క్యులర్‌ని ఒప్పజెప్పేస్తాం.

'టుమారో యీజ్ హాలిడే... ఆన్ అకౌంట్ ఆఫ్ సెకండ్ స్టాటర్‌డే' అని మేం ఒప్పజెప్పంగావే క్లాసులో ఉన్న టీచరు కూడా మాతో పాటు నవ్వేస్తా 'రేపు రెండో శనివారం. ఇస్కూలు ఉండదురో' అంటుంది- 'సర్క్యులర్‌లో సంతకం పెడతా.

వెలకొక తడవ యిలా సెకండ్ స్టాటర్‌డే, సండే కలిసొస్తే రెండు రోజుల పాటు ఆరాంగా ఆడుకోవచ్చుగదా అని మా కిలాస్‌లోని సతీషు సింగుగాడో, ఎన్.ఎమ్.సురేషు గాడో అనుకోవచ్చు గానీ నాకు మాత్రం ఆ కర్మే బట్టలా.

ఏమంటే ఆరాంగా ఆడుకునేందుకు నాకు మా ఇస్కూలు యిచ్చే సెలవలే గాకుండా యింకో రకం స్పెషలు సెలవలు కూడా ఉన్నాయి.

వాటి పేరు జరీనాంటీ సెలవలు!

వారానికో, రెండు వారాలకో ఒక తడవ మా జరినాంటీ, జరినాంటీ బర్త వాజీద్ సాయిబు కుంగా పావగొట్టేసుకుని నవ్వేంత? అంటే నవ్వేంత? అనుకునేస్తారు గదా! అవ్వదు. మద్దెస్తానికి (రాజీకి) టంచనుగా మా అమ్మా నాయినా బయలుదేరాలి. జరినాంటికి చెప్పాల్సిన మాటలు జరినాంటీకి, వాజిద్ సాయిబుకు చెప్పాల్సిన మాటలు వాజిద్ సాయిబుకి చెప్పి, రొంత సజాయించి, రొంత నవ్వించి ఎట్నోకట్ట వాళ్లకి రాజీ చెయ్యాలి. అప్పటికిగానీ వాళ్లు యాదిలో నుంచి యింట్లోకి కదలరు. ఆయన పని కెళ్లడు. ఆమె వంట మొదలు పెట్టదు.

మా జరీనాంటీ వాజిద్ సాయిబూ యిట్టా తగూలాడుకున్నప్పుడల్లా మా అమ్మా నాయిన చెప్పే మాట తప్పితే సాయానా ఆ దేవుడు దిగొచ్చి చెప్పినా యినరుగాబట్టి యీళ్లు తగులాడుకున్నారంటే ఆ రోజింక మన యిస్కూలికి సెలవు కిందే లెక్క. (మద్దెస్తానికి మా అమ్మ ఎనకనే మనం కూడా రెడీ అయిపోతాం గదా. అదీ కత).

యింతకీ యీ జరినాంటీ (జరీనా + ఆంటీ) ఎవురంటే మా అమ్మకి సాయానా చెల్లెలు. మా పెదమ్మ, మా అమ్మ తర్వాతల మా అమ్మమ్మకు కొడుకు వుడతాడనుకుంటే జరినాంటీ వుట్టిందట. అయినాగానీ ఆడింది ఆట, పాడింది పాటగా ఎదిగి చివరికి వాజిద్ సాయిబు పాలబడింది.

అప్పట్నుంచి మొదలయ్యింది వాళ్ల రచ్చ కాపరం!


ఆ రోజు పొద్దున్నే మేము పక్కల మీది నుంచి సరిగా లేవనుకూడా లేవక ముందే మా జరినాంటి కూతురు ఏడేళ్ల ఆలిమా ఏడ్చుకుంటా వచ్చింది మా యింటికి.

'ఆంటో... బాబా... అమ్మను కొట్టేస్తా ఉండాడు ఆంటో' అనింది మా అమ్మతో ఏడస్తానే.

ఆ మాటలు యినంగానే మా అమ్మ మొకంలో లోపలొకరు కూచోనుండారు ఎడమొకం పెడమొకంగా.

మా జరినాంటీ కుయ్‌కుయ్‌మంటా ఉంటే వాజిద్ సాయిబేమో చేతిలో గీతా పళ్లపొడేసుకొని కూచొనున్నాడు గమ్మునా.

'రా అకా. తీసకబో నీ చెల్లెల్ని. యింక నా వల్లగాదు' అన్నాడు మా అమ్మను చూట్టంతోటే.




ఎక్కడలేని చురుకు వచ్చేసింది.

'మళ్లా మొదులుబెట్టినాడా మీ నాయిన? ఆట' అనింది, మంటగా.

ఆ మాటలకు మా నాయిన లేచి కూచున్నాడు. పొద్దున్నే యిదేమి కర్మరా నాయినా అన్నట్టుగా చేతి వేళ్ల తట్టు చూసుకుంటా 'ఏం చేస్తాం. పా' అనినాడు మా అమ్మతో.

అందరం బయలు దేరినాం.

ముందు మా అమ్మ ఆలిమా.

ఎనక మా నాయిన.

అనేక పెద్ద పుడింగిలా నేను.

మేము పోయే తలికే కొట్టేసుకోవడం పూర్తయ్యినట్టుంది... వాకిలి బయటొకరు, వాకిలి

'ఎందుకని నాయినా? ఏం చేసిందని నిన్ను?' అనింది మా అమ్మ యిదిలింపుగా.

మా అమ్మను చూడగావే 'చూడకా. ఎట్టా కొట్టి సంపేస్తున్నాడో' అనింది జరినాంటీ – పెద్దగా ఏడస్తా.

ఎర్రగా తట్లు తేలిన జరినాంటి బుగ్గల్ని చూసి మా అమ్మకి ఎక్కిపోయింది కోపం.

'నీ చేతులిట్టా మిడిసి పడతా ఉన్నాయేమయ్యా వాజిద్. ఇది నీకు మర్యాదైన పనేనా చెప్పు?' అనింది అక్కసుగా.

రాంగానే కుర్చీలో కాళ్లు చావుకున్న మా నాయిన కూడా నోరావలిస్తా 'దీనికి నీ సంజాయిషీ ఏంది చెప్పు' అన్నట్టు చూశాడు వాజిద్ సాయిబు తట్టు.

'అంతేలే అకా. మీరు దాని ఏడుపే చూస్తారు గానీ నా బాధ చూస్తారా?' అన్నాడు వాజిద్ సాయిబు మా అమ్మ తట్టు నిష్టూరంగా చూస్తా.

'పొద్దున లేస్తే జేబులో డబ్బులు పోతా ఉన్నాయే ఆ సంగతి ఎవరితో చెప్పకునేది?' అన్నాడు మళ్లా.

'ఏమ్మె' అనింది మా అమ్మ జరీనాంటి తట్టు చూస్తా.

'అయ్యో... వొట్టకా. ఒక్క రూపాయి ఎరగను. డబ్బులు కావాలంటే అడిగి తీసుకోవా? దొంగతనం చేసే కర్మ నాకేమి బట్టింది' అనింది.

ఆ మాట యినడంతోటే నాలిక కొరకతా ఒంటికాలి మీద లేచాడు వాజిద్ సాయిబు.

'చూడకా. ఇదీ వరస. తీస్తదీ ఏమీ ఎరగనట్టు ఒట్టేస్తది. రాత్రి చొక్కా జేబులో రెండు యాభై నోట్లు పెట్టి పొణుకున్నాను. పొద్దున లేచి చూస్తే ఒకాభై ఉంది. ఒకాభై లేదు. ఏమైనట్టు? గోడ మింగేస్తుందా? అయ్యినలే సామాన్ల డబ్బులు.

యిప్పటికిప్పుడు యాభై రూపాయలు ఎక్కణ్ణుంచి తెచ్చేది?' అని నెత్తి కొట్టుకున్నాడు.

(సామాన్ల డబ్బులంటే రేడియో సామాన్లని అర్థం. వాజిద్ సాయిబుకి మా కావలిలోని పాట్టి శ్రీరాములు సెంటర్లో చిన్న రేడియో మెకానిక్ షాపు వుంది. స్టార్ ఎలక్ట్రానిక్స్ దాని పేరు. పేరుకది స్టార్ ఎలక్ట్రానిక్సే అయినా వాజిద్ సాయిబుకి స్టారు లా. పొగులు పొద్దస్తం ఆ షాపులో కూచొని రేడియోలని గుర్రుగుర్రుమని ఆడిస్తా, సాల్టింగ్ రాడ్ని (షోల్డరింగ్ రాడ్ని మేమట్టా పిలస్తాం) లెద్దులో ముంచతా ఎన్ని తిప్పలు పడ్డా ఆయన సంపాదించేది యాబయ్యో అరవయ్యో. ఒకో రోజు రేడియోలు రిపేరుకి రాకపోతే ఆ సంపాదన కూడా లా).

సామాన్ల డబ్బులనే సరికి, మా నాయిన కూడా అట్టా సామాన్ల డబ్బులు జేబులో పెట్టుకు తిరిగే కరెంటు పనోడే కాబట్టి వాజిద్ సాయిబు పక్షం వహించేశాడు – మాట సాయానికి.

'ఏమ్మె జరీనా! ఎవురో ఏందో సామాన్ల కొసరమని డబ్బులిచ్చుంటారు. వాటిని నువ్వు మాకేస్తే ఎట్టా?' అన్నాడు మందలింపుగా.

'అయ్యో దూలేజాన్ (పెదబావ)! నువ్వు కూడా అట్టంటావేంది? సత్తె ప్రమాణకంగా చెబుతున్నా. నేను తియ్యలా. ఈ ఎతిమతం మనిషి రాత్రి వొచ్చేటప్పడే యాడో పారేసుకొని ఉంటాడు' అనింది.

వాజిద్ సాయిబు కొరకొరా చూసినాడు ఆ మాటలకి.

'చూసినావా కరీంభాయ్! యిట్టాంటి కంత్రీ ఆడ మనిషితో ఏమని కాపరం చేసేది చెప్ప. ఒక రోజయితే పోనీలే అనుకోవచ్చు. రోజూ అదే దరువాయెనే. ఇంటికొచ్చి చొక్కా తగిలిస్తే చాలు డబ్బులు గాయబ్ చేసేస్తా ఉంది. అట్టాగని నేనే తీసుకున్నాలే అని చెప్తుందా అంటే అదీలా' అన్నాడు బాదగా.

మా అమ్మ ఆ మాటలు యిని, వాజిద్ సాయిబు తట్టు జరినాంటి తట్టు మార్చి మార్చి చూసి 'చోద్యంగా ఉందమ్మా మీ కాపరం' అనింది యింకేమనాలో తెలియక.

'అది కాదమ్మె! నీకు కావాలంటే అడిగి తీసుకో వచ్చుగదా' అన్నాడు మనా నాయిన జరీనాంటితో.

**మా జరీనాంటీ చెప్పిన జవాబుకు మా నాయిన బిత్తర తిరిగిపోతే మా అమ్మ ఆచ్చర్యంతో నోటి మీద చెయ్యేసుకొనింది. 'అయితే మాత్రం సేయ్! ఖురాను మీద ఒట్టెయ్యడానికి రెడీ అయిపోవడమేనా! కళ్లు పోతాయే లమిడి' అనింది జరీనాంటీకి బయం చెప్తా.**



'మళ్లా అదే మాట దూలేజాన్! కావాలంటే చెప్ప ఎవరి మీద ఒట్టెయ్యమంటావో చెప్ప' అనింది జరినాంటి రుజువుకు లేస్తా.

యింక వాజిద్ సాయిబుకు వూనకం వచ్చేసింది.

'సామ్మె. ఖురాన్ పెట్టె కాడికి పా. ఖురాన్ మీద ఒట్టేసి చెబుదూగానీ అదే మాట' అన్నాడు రంకె వేస్తా.

జరీనాంటీ కూడా తిరుక్కునేసింది. 'పా. నాకేం బయమా? ఖురాన్ను నెత్తి మీద పెట్టుకొని మరీ చెబుతా. నేను తియ్యలా. తియ్యలా. అంతే' అనింది, తెంపుగా.

వాజిద్ సాయిబు రోతగా చూసినాడు జరినాంటీ తట్టు.

'ఛీ ఛీ. ఇంత గుండెలు తీసిన బొంటుని యాడా చూళ్లేదు' అని, యింకాడ ఉండడం యిష్టంలాక చొక్కా ఏసుకొని బజారుకు బయలు దేరినాడు.

మా నాయిన ఆయన పోతా వుంటే చూసి 'ఇన్ని గొడవలెందుకులే వాజిద్! డబ్బులు చొక్కా జేబులో పెట్టబాక. జరీనాకి కనిపించకుండా యాడైనా దాచెయ్యి' అన్నాడు సలహాకి.

ఆ మాటలు యినీ యిననట్టు ఎళ్లిపోయినాడు వాజిద్ సాయిబు.

'యిప్పడు చెప్పనే. ఏందీ పనులు. ఎవురివో డబ్బులు జేబులో ఉన్నాయి కదా అని నువ్వు మాకేస్తే ఎట్టా?' అన్నాడు మా నాయిన– దొంగ మన్నేలే సంగతేందో చెప్ప అన్నట్టు.

జరినాంటీ సత్తెం చెప్పేసింది.

'ఏం చేసేది దూలెజాన్. ఇదంతా నా తక్దీరు. మా ఆయన చేతగానితనం. ఒకరికిద్దరు బిడ్డల్ని కనినాడే, రోజూ దోపిడీ చేసో, దొంగతనం చేసో టయానికి డబ్బులు యింటికి పంపే బళ్లా. అహా. అదిలా. మద్యానం పదకొండుకో పన్నెండుకో లింగులింగుమని యిరవై రూపాయలు పంపతాడు పెద్ద ముల్లెలాగ. ఇంట్లో ఉండేది నలగరం. మాకు తోడు అంగట్లో పనిపిల్లోడు యింకొకడు. అయిదు మందికి యిరవై రూపాయలతో రెండు పూటలా వండి వార్చాలంటే సాద్యమయ్యే పనేనా? నువ్విచ్చేది సంటిదాని పాలకే చాలవయ్యా... యింకా కొన్ని డబ్బులియ్యయ్యా అని ఎన్నిసార్లు బతిమి లాడినానో అడుగు. ఎప్పడు చూసినా ఇయ్యి సామాన్ల డబ్బులు తాకబాక. అయ్యి సామాన్ల డబ్బులు తాకబాక అంటాడే గానీ చెయ్యి సాచి ఎప్పడైనా ఇచ్చి ఎరిగినాడా? అట్టాంటి మనిషున్నప్పడు దొంగతనం చేయక బాయిలో దూకి సావమంటా?' అని బొలబొలమని ఏడ్చేసింది.

జరినాంటీ జవాబుకు మా నాయిన బిత్తర తిరిగిపోతే, మా అమ్మ ఆచ్చెర్యంతో నోటి మీద చెయ్యేసుకునింది.

'అయితే మాత్రం సేయ్! ఖురాను మీద ఒట్టేసే దానికి రెడీ అయిపోవడమేనా? కళ్లుపోతాయే లమిడీ' అనింది బయం చెప్తా.

'పోనీలే అకా. నా బిడ్డల కంటేనా. నా మొగుని కంటేనా. వాళ్ల కడుపు నిండితే అంతే చాలు' అనింది మా బంగారు జరీనాంటి కళ్లమ్మట కారే నీళ్లని పయిటతో తుడుచుకుంటా.

**–మహమ్మద్ ఖదీర్‌బాబు**